
# 7.2 కాదు.. 6.6 శాతమే!

**జీడీపీ వృద్ధి అంచనాలకు ఆర్బీఐ కోత • దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు • ద్రవ్యోల్బణం 4.8 శాతానికి పెరగొచ్చు**

**తాజా ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ • కీలక వడ్డీరేట్లు ఈసారీ యథాతథం • సీఆర్ఆర్ అర శాతం తగ్గింపు**

ముంబై, డిసెంబర్ 6: దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఛాయలు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా ద్రవ్యసమీక్షలో ప్రస్ఫుటంగా కనిపించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఆర్బీఐ తగ్గించిన జీడీపీ వృద్ధిరేటు అంచనాలే ఇందుకు నిదర్శనం. ఈసారి 6.6 శాతానికే వృద్ధిరేటు పరిమితం కావచ్చని ఆర్బీఐ పేర్కొన్నది మరి. గతంలో 7.2 శాతంగా ఈ అంచనా ఉండటం గమనార్హం. ఇప్పటికే ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో దేశ జీడీపీ అధికారిక గణాంకాలు 7 త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే నమోదైన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కూడా ఒకింత ఆందోళన వెలిబుచ్చిన సంగతి విదితమే. కాగా, అకాల వర్షాలు ఆగిపోతే, కేంద్ర ప్రభుత్వం మౌలిక రంగాభివృద్ధికి పెట్టుబడులను పెడుతూపోతే వృద్ధిరేటు తిరిగి పుంజుకోవచ్చన్న ఆశాభావాన్ని శుక్రవారం ద్రవ్యసమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆయా రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని, ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత ఎగదోయవచ్చన్న ఆందోళననూ కనబర్చారు. ఇదిలావుంటే ఊహించినట్టుగానే తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలోనూ రెపో రేటు జోలికి ఆర్బీఐ వెళ్లలేదు. ఆరుగురు సభ్యుల ద్రవ్యవిధాన కమిటీలో నలుగురు కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచేందుకు మొగ్గుచూపారు.



ద్రవ్యసమీక్ష సమావేశంలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో డిప్యూటీ గవర్నర్లు టీ రవి శంకర్, ఎం రాజేశ్వర్ రావు, మైఖేల్ దేబబ్రత పాత్ర, స్వామినాథన్ జానకిరామన్

### ధరలు తగ్గవ్

ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవని ఆర్బీఐ తేల్చేసింది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను పావు శాతానికిపైగా పెంచేసింది. 4.8 శాతంగా ప్రకటించింది. మునుపు ఇది 4.5 శాతంగానే ఉండటం గమనార్హం. ఇక ఆహారోత్పత్తుల ధరలు అదుపులోకి రావడం లేదని, దీంతో ఈ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలోనూ రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగేందుకే అవకాశాలున్నాయని ఆర్బీఐ గవర్నర్ దాస్ చెప్తున్నారు. 5.7 శాతంగా నమోదు కావచ్చన్నారు. అయితే జనవరి-మార్చిలో 4.5 శాతానికి దిగిరావచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.2 శాతానికి చేరిన సంగతి విదితమే. గత ఏడాది సెప్టెంబర్ తర్వాత ఈ స్థాయికి వెళ్లడం ఇదే తొలిసారి. కూరగాయలు, వంటనూనెలు, పప్పుధాన్యాల రేట్లకు రెక్కలు తొడగడమే ఇందుకు కారణం.

### మ్యూల్‌హంటర్.ఏఐ

ఆర్థిక మోసాలకు తావిస్తున్న మ్యూల్ అకౌంట్లకు అడ్డుకట్ట వేసేందుకు 'మ్యూల్‌హంటర్.ఏఐ'కి శ్రీకారం చుట్టామని, ఇందులో భాగస్వామ్యం కావాలని బ్యాంకులను ఆర్బీఐ కోరింది. డబ్బును ఎరగా చూపి అమాయకుల చేత బ్యాంకుల్లో నేరగాళ్లు తెరిపించే ఖాతాలనే మ్యూల్ అకౌంట్స్ అంటారు. అయితే క్రిమినల్స్ తమ అక్రమార్జనను ఈ ఖాతాల్లో భద్రపర్చుకొని తప్పించుకు తిరుగుతుండటాన్ని ఆర్బీఐ గుర్తించింది. ఈ ఖాతాలను కనిపెట్టి చెక్ పెట్టడంపై దృష్టి పెట్టిన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్.. మ్యూల్‌హంటర్.ఏఐని అభివృద్ధిపర్చింది. రెండు భారీ ప్రభుత్వ రంగ బ్యాంకులతో కలిసి చేపట్టిన మ్యూల్‌హంటర్.ఏఐ పైలట్ ప్రాజెక్ట్‌లో ఉత్సాహవంతమైన ఫలితాలు వచ్చాయనీ దాస్ చెప్పారు. కాబట్టి బ్యాంకులన్నీ సహకరిస్తే ఈ అక్రమ కార్యకలాపాలకు ఇట్టే చెక్ పెట్టవచ్చన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సైతం మ్యూల్‌హంటర్.ఏఐని వినియోగించుకోవాలని బ్యాంకులకు సూచించింది.

### 4 శాతానికి సీఆర్ఆర్ తగ్గింపు

ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల నడుమ కీలక వడ్డీరేట్ల తగ్గింపుల జోలికి వెళ్లలేకపోతున్న ఆర్బీఐ.. ఆర్థిక మందగమనం సంకేతాల మధ్య ఈసారి ద్రవ్య సమీక్షలో నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని తగ్గించింది. తద్వారా మార్కెట్‌లో రుణ లభ్యతను పెంచింది. అర శాతం కోత పెడుతూ 4.5 శాతం నుంచి 4 శాతానికి సీఆర్ఆర్‌ను పరిమితం చేసింది. ఈ నిర్ణయం రెండు విడుతల్లో అమల్లోకి రానుండగా, డిసెంబర్ 14, 28 తేదీల్లో బ్యాంకులకు సీఆర్ఆర్ మిగులు నిధులు అందుబాటులోకి వస్తాయని ఆర్బీఐ గవర్నర్ దాస్ స్పష్టం చేశారు. దీంతో బ్యాంకుల్లోకి అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నగదు నిల్వలు రానున్నాయి. 2022 మే 4న సీఆర్ఆర్‌ను 4 శాతం నుంచి 4.5 శాతానికి ఆర్బీఐ పెంచింది. మే 21 నుంచే ఆ నిర్ణయం అమల్లోకి వచ్చింది. అప్పట్నుంచి అది అలాగే ఉన్నది. కాగా, వాణిజ్య బ్యాంకులు తాము కస్టమర్ల నుంచి సేకరించిన డిపాజిట్లలో కొంతమేర బ్యాంక్ వాల్ట్స్‌ల్లో లేదా ఆర్బీఐ వద్ద పెట్టాల్సి ఉంటుంది. ఆ మొత్తాలకు సంబంధించిన నిష్పత్తే సీఆర్ఆర్. ఇప్పుడు బ్యాంకులు తమ డిపాజిట్లలో 4 శాతం పక్కకు పెట్టాల్సి ఉంటుంది. వీటిపైన బ్యాంకులకు ఎలాంటి ఆదాయం ఉండదు. ఖాతాదారుల ప్రయోజనార్థం ఆర్బీఐ సీఆర్ఆర్‌ను అమలుపరుస్తూ ఉంటుంది.

- కీలక వడ్డీరేట్లు యథాతథం. వరుసగా 11వ ద్రవ్యసమీక్షలోనూ 6.5 శాతం వద్దే రెపో రేటు.
- ప్రవాసుల విదేశీ కరెన్సీ డిపాజిట్లను ఆకర్షించేందుకు ఆర్బీఐ వాటిపై వడ్డీరేట్లను పెంచింది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనమవుతున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. వివిధ కాలపరిమితి డిపాజిట్లపై తక్షణమే పెరిగిన వడ్డీరేట్లు అమల్లోకి వచ్చాయి.
- యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ప్రీ-సాంక్షన్డ్ రుణాలకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ అనుమతిచ్చింది. దీంతో రుణాల లభ్యత మరింత సులభతరమైనట్టైంది. కాగా, త్వరలోనే ఈ నిర్ణయానికి సంబంధించిన మార్గదర్శకాలను రిజర్వ్ బ్యాంక్ విడుదల చేయనున్నది.
- డాలర్ ముందు రూపీ వెలవెలబోతున్న తరుణంలో విదేశీ వాణిజ్య లావాదేవీల్లో డాలర్ చలామణిని తగ్గించేలా ఏ చర్యల్నీ తీసుకోవడం లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. అయితే డాలర్ పెరుగుదల ప్రభావం వాణిజ్యంపై పడకుండా ఇతర మార్గాల్లో ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నది. కొన్ని దేశాలతో స్థానిక కరెన్సీల్లోనే పరస్పర వాణిజ్య లావాదేవీలకు ఆర్బీఐ కృషి చేస్తున్నది తెలిసిందే.
- తదుపరి ద్రవ్యసమీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 5-7 తేదీల్లో.

## ఎవరేమన్నారు?

ఈసారి ద్రవ్యసమీక్షలో దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు కలిసొచ్చే నిర్ణయాలనే ఆర్బీఐ ప్రకటించింది. సీఆర్ఆర్ తగ్గింపు, విదేశీ కరెన్సీ డిపాజిట్లపై వడ్డీరేట్ల పెంపు, పూచీకత్తులేని వ్యవసాయ రుణాల పరిమితిని పెంచడం బాగుంది.

*- సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్*

ఆర్బీఐ పరపతి విధానం ఊహించినట్టుగానే ఉన్నది. అయితే సీఆర్ఆర్ తగ్గింపును ఇండస్ట్రీ తరఫున స్వాగతిస్తున్నాం. ఈ నిర్ణయం దేశ జీడీపీ వృద్ధి రేటుకు ఊతమివ్వగలదు.

*- హర్షవర్ధన్ అగర్వాల్, ఫిక్కీ అధ్యక్షుడు*

దేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని ఉత్పాదక రంగాలకు సీఆర్ఆర్ తగ్గింపుతో అదనపు నగదు వనరులు అందుబాటులోకి రాగలవు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్బీఐ తీసుకున్న ఈ నిర్ణయం బాగుంది.

*- చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్*

వడ్డీరేట్లు గతకొంత కాలంగా స్థిరంగానే ఉంటుండటంతో నిర్మాణ రంగంలో హౌజింగ్ డిమాండ్ కూడా సజావుగానే సాగుతున్నది. వచ్చే ఏడాది ద్రవ్యసమీక్షల్లోనైనా వడ్డీరేట్లు తగ్గుతాయని ఆశిస్తున్నాం.

*- క్రెడాయ్, నరెడ్కో అధ్యక్షులు*

ఎగుమతిదారులు ఇప్పటికే నగదు కొరత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో సీఆర్ఆర్‌ను ఆర్బీఐ తగ్గించడం వల్ల రుణాల ద్వారా వారికి నగదు లభ్యత పెరుగుతుంది.

*- అజయ్ సహాయ్, ఎఫ్ఐఈవో డైరెక్టర్ జనరల్*

## ధరల గుర్రానికి కళ్లెం వేయాలి: దాస్

వరుసగా 11వ ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచిన నేపథ్యంలో వృద్ధిరేటుకు ఊతమిచ్చేలా ఇకనైనా వడ్డీరేట్లను తగ్గించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం కట్టడే తమ లక్ష్యమని, ధరల గుర్రానికి కళ్లెం వేయడంపైనే ప్రధానంగా దృష్టి పెడుతాంటూ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ఇక ఈ జూలై-సెప్టెంబర్‌లో దేశ జీడీపీ 5.4 శాతానికి పడిపోవడం, అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతాన్ని దాటేయడంతో వృద్ధిరేటును పెంచేందుకు, ద్రవ్యోల్బణాన్ని దించేందుకు అవసరమైన అన్ని సాధనాలనూ ఉపయోగిస్తున్నామని దాస్ చెప్పారు.



## మీకు నేను హెడ్‌లైన్ కాను

పదవీకాలం పొడిగింపుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు 'ఈ విషయంలో నేను మీకు ఏ హెడ్‌లైన్ ఇవ్వను' అంటూ దాస్ సమాధానాన్ని తోసిపుచ్చారు. ఈ నెల 10తో ఆర్బీఐ గవర్నర్‌గా దాస్ పదవీకాలం ముగియనున్నది. ఇప్పటికే దాస్ టెన్యూర్‌ను కేంద్ర ప్రభుత్వం మూడేండ్లు పెంచిన విషయం తెలిసిందే. 2021లో పదవీకాలం నెల రోజుల్లో ముగుస్తుందనగా పొడిగించారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఊర్జిత్ పటేల్ రాజీనామాతో దాస్ వచ్చిన సంగతి విదితమే. ఇక ఆర్బీఐ చరిత్రలో అత్యధిక కాలం గవర్నర్‌గా పనిచేసినవారి జాబితాలో బెనగల్ రామారావు తర్వాత దాస్‌దే స్థానం. ఆర్బీఐ తదుపరి గవర్నర్ ఎవరన్నది ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో కూడిన కమిటీ నిర్ణయిస్తుంది.

# మారుతి కార్ల ధరలు మరింత పైకి

**4 శాతం వరకు పెంచబోతున్న సంస్థ**

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ కూడా కొనుగోలుదారులకు షాకిచ్చింది. నూతన సంవత్సరంలో వాహనాలు కొనుగోలు చేసేవారి జేబులకు మరిన్ని చిల్లులు పడనున్నాయి. జనవరి నుంచి కార్ల ధరలను 4 శాతం వరకు పెంచుతుండటమే ఇందుకు కారణం. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే కార్ల ధరలు పెంచాల్సి వస్తున్నదని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆయా మాడళ్లు నాలుగు శాతం వరకు పెరగనున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ హెచ్చుతగ్గుదలకారణంగా సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా కొంతమేర ధరలు పెంచినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థ ఆల్టో నుంచి మల్టీ-యుటిలిటీ వాహనమైన ఇన్విక్టో మాడల్‌ను దేశీయంగా విక్రయిస్తున్నది. ఇప్పటికే హ్యుందాయ్ మోటర్ రూ.25 వేల వరకు ధరలు పెంచగా, లగ్జరీ కార్ల తయారీ సంస్థయైన మెర్సిడెజ్-బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీలు తమ వాహన ధరలు పెంచుతున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి కూడా.



### మహీంద్రా, ఎంజీ కూడా..

మహీంద్రా, ఎంజీ మోటర్ కూడా వాహన ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించాయి. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు తెలిపింది. రవాణ ఖర్చులతోపాటు ఇతర ఖర్చులు పెరగడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని పేర్కొంది.

# బంగారం కడ్డీలపై హాల్‌మార్కింగ్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: బంగారం కడ్డీలపై కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన రత్నాలు-ఆభరణాల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. బంగారు ఆభరణాలపై 2021 నుంచి హాల్‌మార్కింగ్ తప్పనిసరిగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వినియోగదారుల ప్రయోజనాలు కాపాడటానికి, ముఖ్యంగా కొనుగోలుదారులకు నాణ్యమైనవి అందించాలనే ఉద్దేశంతో ఈ హాల్‌మార్క్‌ను తప్పనిసరి చేస్తున్నట్లు చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ రంగం లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నాలుగేండ్ల క్రితం అమలులోకి వచ్చిన హాల్‌మార్కింగ్ విధానంతో 40 కోట్లకు పైగా బంగారు ఆభరణాలు హాల్‌మార్కింగ్ వేసుకున్నట్లు తెలిపారు. 2023లో 44 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీయ బంగారు, ఆభరణాల మార్కెట్ 2030 నాటికి 134 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తంచేశారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం ఎగుమతి కలిగిన భారత్..మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 3.5 శాతంగా ఉన్నదన్నారు. ఇప్పటి వరకు 1.95 లక్షల రిజిస్టర్డ్ జ్యూవెల్లర్లు హాల్‌మార్కింగ్ ఆభరణాలను విక్రయిస్తున్నారు.

# సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

**మార్కెట్లకు రుచించని ఆర్బీఐ నిర్ణయం**

ముంబై, డిసెంబర్ 6: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ వృద్ధిరేటు అంచనాను తగ్గిస్తూ రిజర్వుబ్యాంక్ ప్రకటించడంతో మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా ఐదు రోజులపాటు లాభాల్లో కదలాడిన సూచీలు చివరకు నష్టాల్లోకి జారుకున్నాయి. 400 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 56.74 పాయింట్ల నష్టంతో 81,709.12 వద్ద ముగిసింది. గత ఐదు సెషన్లలో సూచీ 2,722.12 పాయింట్లు లేదా 3.44 శాతం లాభపడిన విషయం తెలిసిందే. మరో సూచీ నిఫ్టీ 30.60 పాయింట్లు కోల్పోయి 24,677.80 వద్ద స్థిరపడింది. సెంట్రల్ బ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గించడంతో మార్కెట్లోకి మరిన్ని నిధులు చొప్పించనున్నది. తీవ్ర ఊగిసలాటలో కొనసాగిన షేర్లు చివరి వరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి.

**జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు**

# ఎల్లారెడ్డి విద్యార్థి ఎంపిక



మహేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 6: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి మహేశ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ నుంచి 15వతేదీ వరకు పంజాబ్‌లోని లూథియానాలో జరిగబోయే ఎస్‌జీఎఫ్ అండర్ 19 హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో మహేశ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతడితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నిఖిల్‌ను ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ సాయిలు, హౌస్ మాస్టర్ ప్రభాకర్, పీఈటీ సురేందర్ తదితరులు అభినందించారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

మాచారెడ్డి, డిసెంబర్ 6 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శీర్షిక, కావ్య, భార్గవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వారిని హెచ్‌ఎం మనోహర్‌రావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

### గోపాల్‌పేటకు చెందిన మౌనిక..

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 6: రాష్ట్ర స్థాయి సీనియర్ ఉమెన్స్ కబడ్డీ పోటీలకు గోపాల్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సీహెచ్ మౌనిక ఎంపికైనట్లు పీడీ సభావత్ కృష్ణ శుక్రవారం తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పేర్కొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి దత్తు క్రీడాకారిణికి మ్యాట్ షూ బహూకరించాడు. మౌనికను ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయుడు రాము తదితరులు అభినందించారు.

### బాన్సువాడ ప్రభుత్వ దవాఖాన తనిఖీ



దవాఖానను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 6: బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ శ్రీనాథ్, ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. దవాఖానలో అందిస్తున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి విద్య, సీహెచ్‌వో దయానంద్, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి, హెడ్ నర్స్ సుబ్బాయమ్మ తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నివాళి



జుక్కల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



బిచ్కుందలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే



బాన్సువాడలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్..



కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 6: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ రచనలో ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ జీవిత చరిత్రను నేటి విద్యార్థులు, యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతితోపాటు అంటరానితనం నిర్మూలన కోసం ఆయన చేసిన గొప్పతనం వర్ణించలేదన్నారు.



మద్నూర్ మండలం మేనూర్‌లో విద్యార్థుకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న**

బాన్సువాడ టౌన్/ భిక్కనూరు/ నిజాంసాగర్, డిసెంబర్ 6 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యురాలు కండాడి జ్యోత్స్న ఆదేశించారు. బాన్సువాడ పట్టణంలోని మైనారిటీ సంక్షేమ బాలికల పాఠశాలలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇన్‌స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించారు. ప్రయోగాలను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. ఆమె వెంట డీఈవో రాజు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలను తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎంఈవో రాజగంగారెడ్డి తదితరులు ఉన్నారు. నిజాంసాగర్‌లోని కస్తూర్బా పాఠశాలను విద్య కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న సందర్శించారు. ఆమె విద్యార్థులతో మాట్లాడి.. భోజనం బాగున్నదా..? మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అనే విషయాలను తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను సందర్శించి, సంతృప్తిని వ్యక్తంచేశారు. అనంతరం మోడల్ స్కూల్, ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను సందర్శించారు. ఆమెవెంట డీఈవో రాజు, జీడీవోవో సుకన్య, ఎంఈవో తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



బస్వాపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యురాలు

### చదువుతో పాటు వైజ్ఞానిక పరిజ్ఞానం అవసరం

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 6 : విద్యార్థులకు చదువుతోపాటు వైజ్ఞానిక పరిజ్ఞానం అవసరమని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆగ్రోస్ చైర్మన్ బాలరాజుతో కలిసి ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు, డీఈవో రాజు, జిల్లా సైన్స్ ఫెయిర్ కో-అధికారి సిద్ధిరాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

### కౌలాస్‌కోటను సందర్శించిన సబ్ కలెక్టర్

బిచ్కుంద, డిసెంబర్ 6: జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం సందర్శించారు. కౌలాస్ కోటకు మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం రానున్నారని ఆమె తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా సరైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమెవెంట తహసీల్దార్ హిమబిందు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్యుడు

### విద్యార్థులు క్షణికావేశానికి లోనుకావొద్దు

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 6: విద్యార్థులు క్షణికావేశాలకు లోను కావొద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మానసిక వైద్యుడు డాక్టర్ రమణ సూచించారు. పిట్లంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మానసిక ఆరోగ్యంపై శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షలో ఫెయిల్ అయ్యామని ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. భవిష్యత్తులో చాలా అవకాశాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌ను పరిమితంగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్, డాక్టర్ రోహిత్, అధ్యాపకుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.